ఈనాడు
తూర్పుగోదావరి

శనివారం 29 డిసెంబరు 2018 16 పేజీలు

# సాంకేతిక రంగంలో జేఎన్‌టీయూకే దూసుకెళ్లాలి

## ఏపీపీఎస్సీ ఛైర్మన్ ఉదయ్ భాస్కర్ • ఘనంగా వర్సిటీ దశాబ్ది వేడుక

భానుగుడి సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: టెక్నాలజీ(సాంకేతిక) రంగంలో జేఎన్‌టీయూకే దూసుకెళ్లాలని ఏపీపీఎస్సీ ఛైర్మన్ ఉదయ భాస్కర్ పేర్కొన్నారు. కాకినాడ జేఎన్‌టీయూ దశాబ్ది వేడుకలు శుక్రవారం అట్టహాసంగా జరిగాయి. కార్యక్రమానికి ఏపీపీఎస్సీ ఛైర్మన్ ఉదయ భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత వర్సిటీ గొప్పతనాన్ని తెలియజేసే 'జయ జయ విద్యావళి' గీతానికి నర్సాపురం, జేఎన్‌టీయూ విద్యార్థిని నృత్యం ప్రదర్శించింది. ముఖ్యఅతిథి ఏపీపీఎస్సీ ఛైర్మన్ ఉదయ భాస్కర్, ఉప కులపతి ఎం.రామలింగరాజు, రిజిస్ట్రార్ వి.వి.సుబ్బారావు, రెక్టార్ శాంతిప్రభలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ ఇక్కడే చదువుకుని, ఉద్యోగం చేసి వేడుకలకు ముఖ్యఅతిథిగా రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. టెక్నాలజీ



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏపీపీఎస్సీ ఛైర్మన్ ఉదయ భాస్కర్, తదితరులు

రంగంలో జేఎన్‌టీయూకే ముందుకు దూసుకెళ్లాలన్నారు. ఒక విద్యార్థి ఆసక్తిపై అధ్యాపకుడి బోధన సాగితే అతనే వందమందికి ఉద్యోగాలు ఇచ్చే పరిస్థితి ఉంటుందన్నారు. బోధన సక్రమంగా లేకుంటే వర్సిటీలు ఎయిడెడ్ కళాశాలలుగా మారిపోతాయన్నారు. రాష్ట్ర విభజనతో జేఎన్‌టీయూకేకు కొంత నష్టం జరిగిందన్నారు. అనంతరం ఉప కులపతి ఎం.రామలింగరాజు మాట్లాడుతూ వర్సిటీ ప్రారంభం నుంచి నేటి వరకు వీసీ హోదాలో పలువురు వ్యక్తులు చేసిన కృషి వివరించారు. రిజిస్ట్రార్ వి.వి.సుబ్బారావు మాట్లాడుతూ జేఎన్‌టీయూకే విద్యార్థులు పలువురు ఉన్నతమైన స్థానాల్లో దేశ ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా ఇనుమడింపజేస్తున్నారన్నారు. వర్సిటీలోని అన్ని విభాగాల్లో కాగిత రహిత ప్రక్రియలను అనుసరిస్తున్నామన్నారు. టెక్నో ఫెయిర్‌లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రాజెక్టులను ముఖ్యఅతిథి సందర్శించి, అభినందించారు. కార్యక్రమంలో వర్సిటీ అధికారులు, విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలు, పూర్వ విద్యార్థులు, ప్రిన్సిపాళ్లు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



కాకినాడ జేఎన్‌టీయూ దశాబ్ది వేడుకల్లో భాగంగా శుక్రవారం విద్యార్థిని నృత్య ప్రదర్శన

-3లో